అతలాకుతలం

బేర్స్ దాడిలో మార్కెట్ విలవిల

మరో 900 పాయింట్లు కోల్పోయిన సెన్సెక్స్
కొంపముంచిన యూఎస్ బాండ్ ఈల్డ్స్

ముంబై, అక్టోబర్ 26: యూఎస్ బాండ్ ఈల్డ్స్, ఇజ్రాయిల్-హమాస్ యుద్ధ భయాలు ప్రపంచ స్టాక్ మార్కెట్లను అతలాకుతలం చేస్తున్నాయి. అటు అమెరికా నుంచి ఇటు జపాన్ వరకూ జరుగుతున్న మార్కెట్ పతనబాటలోనే భారత్ సైతం పయనిస్తున్నది. బేర్స్ దాడుల్లో బుల్స్ విలవిలలాడుతున్నారు. అమ్మకాలు అదేపనిగా వెల్లువెత్తడంతో వరుసగా ఆరో రోజైన గురువారం బీఎస్ఈ సెన్సెక్స్ 900 పాయింట్ల పతనాన్ని చవిచూసింది. అక్టోబర్ 17 నుంచి ఆరు ట్రేడింగ్ రోజుల్లో ఇప్పటివరకూ ఈ సూచీ 3,279 పాయింట్లు కోల్పోయింది. తాజాగా ఎన్ఎస్ఈ నిఫ్టీ కీలకమైన 19,000 పాయింట్ల స్థాయిని వదులుకుంది. అధిక వడ్డీ రేట్లు దీర్ఘకాలం కొనసాగుతాయన్న అంచనాలతో యూఎస్ బాండ్ ఈల్డ్స్ మరో దఫా 5 శాతం స్థాయిని సమీపించడంతో రిస్కీ సాధనమైన స్టాక్స్ నుంచి వైదొలిగేందుకు విదేశీ ఇన్వెస్టర్లు భారీ అమ్మకాలు జరపడంతో తాజా మార్కెట్ పతనం సంభవించిందని విశ్లేషకులు తెలిపారు. మధ్యప్రాచ్యంలో నెలకొన్న యుద్ధ సంక్షోభంతోనూ సెంటిమెంట్ పూర్తిగా దెబ్బతిన్నదని అన్నారు. అలాగే అక్టోబర్ డెరివేటివ్ కాంట్రాక్టులకు ముగింపు రోజుకావడంతో గురువారం విక్రయాలు తీవ్రతరమయ్యాయన్నారు. సెన్సెక్స్ 900 పాయింట్ల నష్టంతో 64,000 స్థాయి దిగువన 63,148 పాయింట్ల వద్ద ముగియగా, నిఫ్టీ 265 పాయింట్లు కోల్పోయి 18,857 పాయింట్ల వద్ద నిలిచింది. వరుస పతనాల్ని చవిచూస్తున్న యూఎస్ మార్కెట్ సైతం బుధవారం నష్టాలతో ముగిసింది. ఇదేబాటలో గురువారం జపాన్ నికాయ్ సూచీ 600 పాయింట్లకుపైగా పతనమయ్యింది. యూరప్ సూచీలు కూడా ఇదేబాటలో నడిచాయి. ఈక్విటీలు ఇంతగా పడిపోతున్నా, క్రూడ్ ధర మాత్రం గరిష్ఠస్థాయిలోనే ట్రేడ్‌కావడం ఇన్వెస్టర్లను ఆందోళన పరుస్తున్నదని విశ్లేషకులు అన్నారు. తాజాగా బ్రెంట్ క్రూడ్ బ్యారల్ ధర 89 డాలర్ల ఎగువనే కదులుతున్నది.

ఎం అండ్ ఎం టాప్ లూజర్

అన్నింటికంటే అధికంగా మహీంద్రా అండ్ మహీంద్రా 4.06 శాతం పతనమయ్యింది. బజాజ్ ఫిన్‌సర్వ్, ఏషియన్ పెయింట్స్, నెస్లే, బజాజ్ ఫిన్‌సర్వ్, జేఎస్‌డబ్ల్యూ స్టీల్, టైటాన్, హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్, టెక్ మహీంద్రా, టాటా మోటార్స్, ఎల్అండ్‌టీ లు 1-4 శాతం మధ్య క్షీణించాయి. మరోవైపు యాక్సిస్ బ్యాంక్ ఐటీసీ, హెచ్‌సీఎల్, ఎన్టీపీసీ, ఇండస్ఇండ్ బ్యాంక్‌లు లాభపడ్డాయి. వివిధ రంగాల సూచీలను చూస్తే..ఆటో ఇండెక్స్ అధికంగా 1.81 శాతం పతనమయ్యింది. ఆయిల్ అండ్ గ్యాస్ ఇండెక్స్ 1.54 శాతం, మెటల్ 1.54 శాతం, ఫైనాన్షియల్ సర్వీసెస్ 1.46 శాతం, కన్జ్యూమర్ డిస్క్రీషనరీ 1.41 శాతం, కన్జ్యూమర్ డ్యూరబుల్స్ 1.41 శాతం, టెలికమ్యూనికేషన్స్ 1.25 శాతం, రియల్టీ 1.22 శాతం, టెక్నాలజీ 1.16 శాతం పడిపోయాయి.

6 రోజుల్లో 18 లక్షల కోట్లు ఆవిరి

ఆరు రోజులుగా కొనసాగుతున్న వరుస పతనంతో రూ.18 లక్షల కోట్ల ఇన్వెస్టర్ల సంపద కరిగిపోయింది. గురువారం మార్కెట్ క్షీణతలో రూ.3 లక్షల కోట్ల సంపదను ఇన్వెస్టర్లు నష్టపోయారు. అక్టోబర్ 17న రూ.323.8 లక్షల కోట్లుగా ఉన్న బీఎస్ఈలో లిస్టయిన మొత్తం కంపెనీల మార్కెట్ విలువ తాజాగా రూ.306 లక్షల కోట్లకు తగ్గింది.

విదేశీయుల దెబ్బ.. 7,700 కోట్లు వెనక్కి

భారత మార్కెట్లో విదేశీ పోర్ట్‌ఫోలియో ఇన్వెస్టర్ల (ఎఫ్‌పీఐలు) అమ్మకాలు మరింత పెరిగాయి. ఎఫ్‌పీఐలు గురువారం ఒక్కరోజులోనే రూ. 7,700 కోట్లు వెనక్కు తీసుకున్నట్టు స్టాక్ ఎక్స్ఛేంజీలు తాజా గణాంకాలు వెల్లడిస్తున్నాయి.

రాష్ట్రంలో రెండంకెల వృద్ధి

టీవీ, స్మార్ట్‌ఫోన్ విక్రయాల్లో జోరు: అమెజాన్

హైదరాబాద్, అక్టోబర్ 26: దేశీయ ఈ-కామర్స్ దిగ్గజం అమెజాన్... ప్రస్తుత పండుగ సీజన్‌లో తెలంగాణలో అత్యధిక వృద్ధిని నమోదు చేసుకున్నది. రాష్ట్రంలో టీవీల విక్రయాలు రెండు రెట్లు పెరగగా, 5జీ స్మార్ట్‌ఫోన్ల అమ్మకాల్లో 60 శాతం చొప్పున పెరిగాయని అమెజాన్ ఇండియా డైరెక్టర్ రంజిత్ బాబు తెలిపారు. నెలవారి చెల్లింపులపై ఎలాంటి వడ్డీ విధించకపోవడంతో కస్టమర్లు ఎగబడి కొనుగోళ్లు జరిపారని, ముఖ్యంగా ప్రీమియం స్మార్ట్‌ఫోన్లు, అతిపెద్ద స్క్రీన్ టీవీలను ఎంచుకున్నట్టు హైదరాబాద్‌లోని ఐఐటీలో జరిగిన అమెజాన్ ఎక్స్‌పీరియన్స్ అరెనా(ఏఎక్స్‌ఏ) కార్యక్రమంలో ఆయన చెప్పారు. ముఖ్యంగా సామ్‌సంగ్, వన్‌ప్లస్, రియల్మీ, నార్జో, షియోమీ వంటి అత్యంత ప్రజాదరణ పొందిన స్మార్ట్‌ఫోన్ల బ్రాండ్లకు కస్టమర్ల నుంచి మద్దతు లభించింది.

2 నుంచి హైదరాబాద్‌లో

ఇండియా గేమ్ డెవలపర్ల సదస్సు

హైదరాబాద్, అక్టోబర్ 26: హైదరాబాద్ మరో అంతర్జాతీయ సదస్సుకు వేదిక కాబోతున్నది. ఇప్పటికే పలు గ్లోబల్ సదస్సులు ఇక్కడ జరగగా..తాజాగా వచ్చే నెల 2 నుంచి 4 వరకు ఇండియా గేమ్ డెవలపర్ల సదస్సు జరగబోతున్నది. దక్షిణాసియాలో అతిపెద్ద గ్లోబల్ సమావేశం హైదరాబాద్‌లోని హెచ్‌ఐసీసీలో జరుగుతుండటం విశేషం. ఈ సమావేశానికి 150 మంది స్పీకర్లు, 100 సెషన్లు, 4 వేల మంది హాజరుకాబోతున్నారు. ప్రధానంగా ఈ సమావేశంలో ఐడీజీసీ, కృత్రిమ మేధస్సు, వెబ్3, ఆర్ట్ అండ్ డిజైన్, టెక్నాలజీ, ప్రొడక్షన్, బిజినెస్ అండ్ ప్రొడక్ట్ మేనేజ్‌మెంట్, అప్లయడ్ గేమ్స్, ఎమర్జింగ్ ట్రెండ్స్, కెరియర్ అవకాశాలపై ప్రధానంగా చర్చించనున్నారు.

రూ.కోటి లోపు ఎఫ్‌డీకి ముందస్తు విత్‌డ్రాయల్ అనుమతి

రూ.15 లక్షల పరిమితిని పెంచిన ఆర్బీఐ

న్యూఢిల్లీ, అక్టోబర్ 26: ఇక నుంచి రూ.1 కోటి వరకూ ఫిక్స్‌డ్ డిపాజిట్లను (ఎఫ్‌డీలు) కాలపరిమితికంటే ముందుగానే తీసుకునే వెసులుబాటును రిజర్వ్‌బ్యాంక్ కల్పించింది. ఇప్పటివరకూ బ్యాంక్‌ల్లో రూ.15 లక్షల లోపు ఎఫ్‌డీలకే ముందస్తు విత్‌డ్రాయల్ సదుపాయం ఉంది. అంతకంటే మించి ఎఫ్‌డీ చేస్తే ఆ డిపాజిట్ కాలపరిమితి ముగిసేంతవరకూ లాక్ అవుతుంది. ఈ పరిమితిని సడలిస్తూ గురువారం బ్యాంక్‌లకు ఆర్బీఐ ఒక నోటిఫికేషన్ విడుదల చేసింది. నాన్- కాలబుల్ (ప్రిమెచ్యూర్ విత్‌డ్రాయల్ ఆప్షన్ లేనివి) డొమెస్టిక్ టెర్మ్ డిపాజిట్ల (టీడీలు) కనీస పరిమితిని 15 లక్షల రూపాయిల నుంచి ఒక కోటి రూపాయిలకు పెంచుతున్నట్టు ఆర్బీఐ తెలిపింది. రూ.కోటి లోపు టీడీలకు ముందస్తు విత్‌డ్రాయల్ సదుపాయం కల్పించాలని బ్యాంక్‌లను ఆదేశించింది. తక్షణమే అమలులోకి వచ్చే ఈ ఆదేశాలు నాన్-రెసిడెంట్ (ఎక్స్‌టర్నల్) రూపీ (ఎన్ఆర్ఈ) డిపాజిట్లకు, ఆర్డినరీ నాన్-రెసిడెంట్ (ఎన్ఆర్‌వో) డిపాజిట్లకు వర్తిస్తాయన్నది. ఈ సర్క్యులర్‌ను అన్ని వాణిజ్య బ్యాంక్‌లు, సహకార బ్యాంక్‌లు అమలు చేయాలన్నది. ఇదే సమయంలో ప్రాంతీయ గ్రామీణ బ్యాంక్‌ల బల్క్ డిపాజిట్ పరిమితిని రూ.15 లక్షల నుంచి రూ.కోటికి పెంచుతున్నట్టు రిజర్వ్‌బ్యాంక్ తెలిపింది.

నాన్-కాలబుల్ ఎఫ్‌డీలపై వడ్డీ ఎక్కువ

సాధారణంగా బ్యాంక్‌లు నాన్-కాలబుల్ ఎఫ్‌డీలపై అధిక వడ్డీని ఆఫర్ చేస్తుంటాయి. ఉదాహరణకు స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా ఒక ఏడాది కాలపరిమితిగల నాన్-కాలబుల్ సర్వోత్తమ్ ఎఫ్‌డీపై వడ్డీ 7.10 శాతంకాగా, ఏడాది కాలపరిమితితో కూడిన సాధారణ ఎఫ్‌డీపై వడ్డీ రేటు 6.8 శాతం ఉన్నది. రెండేండ్ల నాన్-కాలబుల్ ఎఫ్‌డీపై 7.4 శాతం, రెగ్యులర్ ఎఫ్‌డీపై 7 శాతం చొప్పున వడ్డీని ఆఫర్ చేస్తున్నది.

కార్వీ పార్థసారథి ఆస్తులు 134 కోట్లు జప్తు

న్యూఢిల్లీ, అక్టోబర్ 26: కార్వీ స్టాక్ బ్రోకింగ్ (కేఎస్‌బీఎల్) ఖాతాదారుల నిధుల మళ్లింపు కేసులో ఆ సంస్థ చైర్మన్, మేనేజింగ్ డైరెక్టర్ సీ పార్థసారథికి చెందిన రూ.134.02 కోట్ల విలువైన ఆస్తుల్ని ఎటాచ్ చేసినట్టు ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఈడీ) గురువారం తెలిపింది. ఈ సమాచారాన్ని ఇడీ ఎక్స్‌లో పోస్టు చేస్తూ పార్థసారధి కుమారుడి పేరిట ఉన్న కేఫిన్ టెక్నాలజీస్ ప్రిఫరెన్స్ షేర్లను జప్తు చేశామని పేర్కొంది. ఒక్కోటి రూ.200 ముఖవిలువ కలిగిన నాన్-కన్వర్టబుల్ ప్రిఫరెన్స్ షేర్లను ఎటాచ్ చేసింది. దీంతో కేఎస్‌బీఎల్ కేసులో ఇప్పటివరకూ జప్తు చేసిన ఆస్తుల విలువ రూ.2,229.56 కోట్లకు చేరింది.

డీహెచ్ఎఫ్ఎల్ ప్రమోటర్ల ఆస్తులు ఎటాచ్

దివాన్ హౌసింగ్ ఫైనాన్స్ (డీహెచ్ఎఫ్ఎల్) ప్రమోటర్లయిన కపిల్ వాధ్వాన్, ధీరజ్ వాధ్వాన్‌లకు చెందిన రూ.70.39 కోట్ల ఆస్తుల్ని జప్తు చేసినట్టు వేరొక పోస్టులో ఈడీ తెలిపింది. యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియాను మోసపుచ్చిన కేసులో ఈ చర్య తీసుకుంది. రూ.28.48 కోట్ల విలువైన పెయింటింగ్స్, శిల్పాలు, రూ.5 కోట్ల వాచీలు, రూ.10.71 కోట్ల డైమండ్ జ్యువెలరీ, ఒక హెలీకాప్టర్‌లో ఉన్న రూ.9 కోట్ల విలువైన 20 శాతం వాటాను, బంద్రాలో రూ.17.10 కోట్ల విలువైన రెండు ఫ్లాట్లను స్వాధీనం చేసుకున్నామన్నది. దీంతో ఈ కేసులో ఎటాచ్ చేసిన ఆస్తుల మొత్తం రూ.2,095.94 కోట్లకు చేరినట్టు ఈడీ తెలిపింది.

ఆకట్టుకున్న ఏజీఐ

హైదరాబాద్, అక్టోబర్ 26: ఏజీఐ గ్రీన్ ప్యాక్ లిమిటెడ్ ఆశాజనక ఆర్థిక ఫలితాలు ప్రకటించింది. ప్రస్తుత ఆర్థిక సంవత్సరం రెండో త్రైమాసికానికిగాను రూ.615 కోట్ల ఆదాయంపై రూ.74 కోట్లు పన్నులు చెల్లించకముందు లాభాన్ని గడించింది. ఆదాయంలో 20 శాతం పెరుగగా, లాభంలో 59 శాతం ఎగబాకింది.

కోరమాండల్ ఫర్వాలేదు

హైదరాబాద్, అక్టోబర్ 26: కోరమాండల్ నిరాశాజనక ఆర్థిక ఫలితాలు ప్రకటించింది. ఈ ఏడాది రెండో త్రైమాసికానికిగాను రూ.7,031 కోట్ల ఆదాయంపై రూ.762 కోట్ల లాభాన్ని గడించింది. క్రితం ఏడాది ఇదే సమయంలో నమోదైన రూ.10,140 కోట్ల ఆదాయంతో పోలిస్తే భారీగా తగ్గగా, నికరలాభంలో పెరుగుదల కనిపించింది.

కెనరా బ్యాంక్ లాభం 3,606 కోట్లు





న్యూఢిల్లీ, అక్టోబర్ 26: ప్రభుత్వరంగ సంస్థ కెనరా బ్యాంక్ ఆర్థిక ఫలితాల్లో అంచనాలకుమించి రాణించింది. సెప్టెంబర్‌తో ముగిసిన మూడు నెలల కాలానికిగాను బ్యాంక్ రూ.3,606 కోట్ల నికర లాభాన్ని గడించింది. ఏడాది క్రితం ఇదే త్రైమాసికంలో నమోదైన రూ.2,525 కోట్ల లాభం కంటే ఇది 43 శాతం అధికం. వడ్డీల ద్వారా వచ్చే ఆదాయం పెరగడంతో పాటు కేటాయింపులు తగ్గుముఖం పట్టడం వల్లనే లాభాల్లో భారీ వృద్ధి నమోదైందని బ్యాంక్ వర్గాలు వెల్లడించాయి. గత త్రైమాసికానికిగాను బ్యాంక్‌కు నికర వడ్డీ ఆదాయం ఏడాది ప్రాతిపదికన 19.76 శాతం ఎగబాకి రూ.8,903 కోట్లకు చేరుకున్నది. మొండి బకాయిల కోసం బ్యాంక్ కేటాయింపులు రూ.3,637 కోట్ల నుంచి రూ.2,608 కోట్లకు తగ్గినట్టు పేర్కొంది. బ్యాంక్ స్థూల నిరర్థక ఆస్తుల విలువ 6.37 శాతం నుంచి 4.76 శాతానికి తగ్గగా, నికర ఎన్‌పీఏ1.41 శాతానికి పరిమితమైంది. బ్యాంక్ అంతర్జాతీయ వ్యాపారం 10 శాతం పెరిగి రూ.21,56,185 కోట్లకు చేరుకున్నది. గత నెల చివరినాటికి బ్యాంక్ 9,518 శాఖలు కలిగివున్నది. వీటిలో 3,059 శాఖలు గ్రామీణ ప్రాంతాల్లో ఉండగా, 1,895 శాఖలు అర్బన్ ప్రాంతాల్లో ఉన్నాయి.

రికవరీ ఏజెంట్లకు ఆర్బీఐ షరతులు

ఉదయం 8 కంటే ముందు..సాయంత్రం 7 తర్వాత కాల్ చేయద్దు

ముంబై, అక్టోబర్ 26: రుణ రికవరీకి సంబంధించి రిజర్వు బ్యాంక్ కఠిన నిబంధనలను అమలు చేయడానికి సిద్ధమవుతున్నది. రుణాలు వసూలు చేయడానికి వెళ్లే రికవరీ ఏజెంట్లపై రిజర్వుబ్యాంక్ కఠిన షరతులు విధించింది. బకాయిల వసూళ్లకు సంబంధించి ఉదయం 8 గంటలలోపు, సాయంత్రం 7 గంటల తర్వాత రుణ గ్రహీతలకు ఎట్టి పరిస్థితుల్లో కాల్ చేయవద్దని ఆదేశించింది. బ్యాంకులు, నాన్-బ్యాంకింగ్ సంస్థలు విధాన రూపకల్పన, కేవైసీ నిబంధనలు నిర్ణయించడం, రుణాల మంజూరుకు సంబంధించి ప్రధాన విధులను ఔట్‌సోర్స్ చేయకూడదని తన ముసాయిదాలో ఆర్బీఐ పేర్కొంది. ఆర్థిక సేవల్లో ఔట్ సోర్సింగ్, ప్రవర్తన నియామవళికి సంబంధించిన ముసాయిదాను తీర్చిదిద్దింది. దీని ప్రకారం ఖాతాదారులతో మాట్లాడే విధానంపై రికవరీ ఏజెంట్లకు శిక్షణ కూడా ఇవ్వాలని సూచించింది. రుణ వసూలు విషయంలో నియంత్రిత సంస్థలుగానీ, రికవరీ ఏజెంట్లు గానీ వ్యక్తులను భౌతికంగా, మౌఖికంగా బెదిరించడం, వేధించడం వంటి చేయకూడదని తన ముసాయిదాలో పేర్కొంది. ఈ ముసాయిదాపై వచ్చే నెల 28 లోగా వాటాదారులు సూచనలు చేయవచ్చునని పేర్కొంది.

బొగ్గు కొరత కృత్రిమమే!

- మోదీ సర్కారు కోల్‌మాల్ వ్యవహారం
- దేశంలో అసలు బొగ్గు కొరతే లేదు
- విదేశీ బొగ్గు ఆధారిత ప్లాంట్లు పూర్తిస్థాయిలో పనిచేయాలన్న ఆదేశాల వెనుక మర్మమేంటి?
- భారత్‌కు బొగ్గు ఎగుమతి చేసే కంపెనీలకు లబ్ధి చేకూర్చడానికే
- పవర్ ఇంజినీర్స్ ఫెడరేషన్ ధ్వజం
- భారత్‌కు బొగ్గు ఎగుమతిలో అదానీ కంపెనీదే సింహభాగం

న్యూఢిల్లీ, అక్టోబర్ 26: కేంద్రంలోని మోదీ సర్కారు సాగిస్తున్న 'కోల్'మాల్ వ్యవహారంపై 'ది ఆల్ ఇండియా పవర్ ఇంజినీర్స్ ఫెడరేషన్' (ఏఐపీఈఎఫ్) ఆగ్రహం వ్యక్తం చేసింది. విదేశీ బొగ్గును దిగుమతి చేసుకొనే విద్యుత్తు ప్లాంట్లన్నీ వచ్చే ఏడాది జూన్ 30 వరకూ పూర్తి సామర్థ్యంతో పనిచేయాలని కేంద్ర ప్రభుత్వం తాజాగా జారీ చేసిన ఆదేశాలను ఏఐపీఈఎఫ్ దుయ్యబట్టింది. దేశంలో అసలు బొగ్గు కొరత లేనే లేదని స్పష్టంచేసింది. విదేశాల నుంచి భారత్‌కు బొగ్గును ఎగుమతి చేసే కంపెనీలకు (మోదీ ఆప్తమిత్రుడు అదానీ కంపెనీలదే సింహభాగం) అనుచిత లబ్ధి చేకూర్చడానికే తాజా ఆదేశాలను జారీ చేసిందని మండిపడింది. కేంద్రం తీసుకున్న ఈ నిర్ణయంతో అంతిమంగా వినియోగదారులపైనే పెనుభారం పడుతుందని ఆందోళన వ్యక్తం చేసింది.

కొరత లేదన్న బొగ్గు శాఖ

దేశంలో అసలు బొగ్గు కొరత లేదని కోల్ మినిస్ట్రీ పేర్కొన్న విషయాన్ని ఏఐపీఈఎఫ్ గుర్తు చేసింది. గత ఏడాదితో పోలిస్తే కోల్ స్టాక్, సప్లయ్ మెరుగుపడిందని పేర్కొన్నది. బొగ్గు దిగుమతి నిర్ణయం సహేతుకం కాదన్న విషయం బొగ్గు మంత్రిత్వ శాఖ గణాంకాలను పరిశీలిస్తే స్పష్టమవుతుందని వివరించింది. ఈ ఏడాది అక్టోబర్ 21 నాటికి 71.35 మిలియన్ టన్నుల బొగ్గు నిల్వలు ఉండగా, గత ఏడాది ఇదే సమయానికి 60.44 టన్నులు మాత్రమే ఉన్నట్టు వివరించింది.

పొడిగించుకుంటూ వస్తున్న కేంద్రం

విదేశీ ఆధారిత థర్మల్ విద్యుత్తు ప్లాంట్లన్నీ పూర్తి సామర్థ్యంలో పనిచేయాలని ఎలక్ట్రిసిటీ చట్టం సెక్షన్ 11 ప్రకారం ఈ ఏడాది మార్చిలో కేంద్రం తొలుత ఆదేశాలిచ్చింది. అనంతరం అక్టోబర్ 31 వరకు గడువును పొడిగించారు. తాజాగా దీనిని వచ్చే ఏడాది జూన్ 30 వరకు పొడిగించారు. అంతేగాకుండా థర్మల్ విద్యుత్తు ప్లాంట్లు తాము వాడే బొగ్గులో కలపాల్సిన విదేశీ బొగ్గును 4 శాతం నుంచి 6 శాతానికి పెంచారు.

అదానీ గ్రూప్‌దే అగ్రభాగం

విదేశాల నుంచి భారత్‌కు అత్యధికంగా బొగ్గు ఎగుమతి చేస్తున్న కంపెనీ అదానీ గ్రూప్‌దే. దేశంలో అత్యధికంగా థర్మల్ విద్యుత్తును ఉత్పత్తి చేస్తున్న కంపెనీ, బొగ్గును సరఫరా చేసే ప్రైవేట్ రైల్వే ర్యాక్స్ వ్యవస్థ కూడా అదానీదే. దేశంలోని కీలకమైన బొగ్గు గనులే కాదు.. ఆస్ట్రేలియా, ఇండోనేషియా తదితర దేశాల్లోనూ అదానీ గ్రూప్‌నకు పెద్ద ఎత్తున బొగ్గు గనులున్నాయి. కేంద్రం తాజా ఆదేశాలు అదానీ గ్రూప్‌నకు అనుచిత లబ్ధి చేకూర్చడానికేనని విమర్శలు వ్యక్తమవుతున్నాయి.

ఐదుగురు లష్కరే ఉగ్రవాదుల హతం

శ్రీనగర్, అక్టోబర్ 26: జమ్ముకశ్మీర్‌లో పోలీసులు, భద్రతా దళాలు జరిపిన కాల్పుల్లో ఐదుగురు లష్కరే తాయిబా ఉగ్రవాదులు హతమయ్యారు. కుప్వారా జిల్లాలోని మచ్చిల్ సెక్టార్‌లో నియంత్రణ రేఖ (ఎల్ఓసీ) వద్ద భారత్‌లోకి ప్రవేశించడానికి ప్రయత్నించిన ఐదుగురు ఉగ్రవాదులను మట్టుబెట్టినట్టు కశ్మీర్ అదనపు డీజీపీ విజయ్ కుమార్ తెలిపారు. మృతులను లష్కరే తాయిబా ఉగ్రవాదులుగా గుర్తించామని, వారి నుంచి ఏకే సిరీస్ తుపాకులు, పెద్ద యెత్తున ఆయుధ సామగ్రిని స్వాధీనం చేసుకున్నట్టు చెప్పారు. ఇటీవలి కాలంలో నియంత్రణ రేఖ వెంబడి చొరబడటానికి ఉగ్రవాదులు తీవ్రంగా ప్రయత్నిస్తున్నారని, అయితే వాటిని తాము ఎప్పటికప్పుడు తిప్పికొడుతున్నామన్నారు. నాలుగు రోజుల క్రితం ఉరి సెక్టార్‌లో ఇద్దరిని, అలాగే జూన్‌లో 11 మంది ఉగ్రవాదులను హతమార్చినట్టు చెప్పారు.

క్యూఎస్ ఎంబీఏ ర్యాంకింగ్స్.. టాప్ 250లో 10 భారత సంస్థలు

న్యూఢిల్లీ, అక్టోబర్ 26: 2024 సంవత్సరానికి గాను ఎంబీఏలో క్యూఎస్ ప్రపంచ యూనివర్సిటీ ర్యాంకింగ్స్‌ను బుధవారం ప్రకటించారు. ఇందులో టాప్-250లో 10 భారత విద్యాసంస్థలకు చోటు దక్కింది. ఐఐఎం బెంగళూరు 48, ఐఐఎం అహ్మదాబాద్ 53, ఐఐఎం కలకత్తా 59 స్థానాల్లో నిలిచాయి. స్టాన్‌ఫర్డ్ గ్రాడ్యుయేట్ స్కూల్ ఆఫ్ బిజినెస్, పెన్(వార్టన్), హార్వర్డ్ బిజినెస్ స్కూల్ జాబితాలో మొదటి మూడు స్థానాలను కైవసం చేసుకున్నాయి. టాప్-250 జాబితాలో చోటు దక్కించుకొన్న భారత విద్యాసంస్థల్లో ఐఐఎం ఉదయ్‌పూర్, ఐఐఎం ఇండోర్, ఐఐఎం లక్నో, ఐఎస్‌బీ గురుగ్రామ్, ఐఎంఐ కోల్‌కతా, ఎక్స్ఎల్ఆర్ఐ-గ్జేవియర్ స్కూల్ ఆఫ్ మేనేజ్‌మెంట్, జంషెడ్‌పూర్ ఉన్నాయి.

అస్సాం సీఎం హిమంతకు ఈసీ నోటీసు

న్యూఢిల్లీ: అస్సాం ముఖ్యమంత్రి, బీజేపీ నేత హిమంత బిశ్వ శర్మపై కాంగ్రెస్ చేసిన ఫిర్యాదుపై ఎన్నికల కమిషన్ గురువారం స్పందించింది. ఛత్తీస్‌గఢ్ మంత్రి మహమ్మద్ అక్బర్‌ను ఉద్దేశించి శర్మ అనుచిత వ్యాఖ్యలు చేశారని, ఆయనపై చర్యలు తీసుకోవాలని కాంగ్రెస్ ఈసీని కోరింది. ఈ వ్యాఖ్యలపై ఈ నెల 30 సాయంత్రంలోగా వివరణ ఇవ్వాలని శర్మను ఈసీ ఆదేశించింది. కాంగ్రెస్ ఫిర్యాదులో తెలిపిన వివరాల ప్రకారం, కవర్ధలో ఈ నెల 18న జరిగిన బీజేపీ ఎన్నికల ప్రచార సభలో శర్మ మాట్లాడుతూ, అక్బర్‌ను పంపించేయకపోతే శ్రీరాముని తల్లి కౌసల్య పుట్టిన గడ్డ అపవిత్రమవుతుందన్నారు.

ప్రియాంక గాంధీకి కూడా..

కాంగ్రెస్ నేత ప్రియాంక గాంధీకి ఈసీ గురువారం నోటీసు ఇచ్చింది. రాజస్థాన్‌లోని దౌసాలో ఈ నెల 20న జరిగిన కాంగ్రెస్ ఎన్నికల ప్రచార సభలో ప్రధాని మోదీపై ఆమె చేసిన వ్యాఖ్యలపై ఈసీకి బీజేపీ ఫిర్యాదు చేసింది. ప్రియాంక దౌసా సభలో మాట్లాడుతూ, మోదీ ఓ దేవాలయానికి ఎన్వలప్‌లో విరాళం ఇచ్చారని చెప్పారు. దాన్ని తెరిచి చూస్తే రూ.21 ఉన్నట్లు తాను టీవీలో చూశానని చెప్పారు. బీజేపీ ప్రజలకు ఎన్వలప్‌లను చూపిస్తుందని, అయితే వాటిలో ఏమీ ఉండదని అన్నారు.

గెహ్లాట్ కుమారుడికి ఈడీ నోటీసులు

- రాజస్థాన్ కాంగ్రెస్ అధ్యక్షుడి ఇంటిపై ఈడీ దాడులు
- ఈడీ దాడులతో దేశంలో బీజేపీ బీభత్సం: గెహ్లాట్


వైభవ్

జైపూర్, అక్టోబర్ 26: అసెంబ్లీ ఎన్నికల ముంగిట రాజస్థాన్‌లో ఈడీ దాడుల కలకలం రేగింది. విదేశీ మారక ద్రవ్య చట్టాన్ని ఉల్లంఘించారన్న ఆరోపణలకు సంబంధించి ఈ నెల 27న తమ ఎదుట విచారణకు హాజరుకావాలని ముఖ్యమంత్రి అశోక్ గెహ్లాట్ కుమారుడు వైభవ్‌కు ఈడీ సమన్లు జారీచేసింది. మరోవైపు పరీక్ష పత్రాల లీకేజీకి సంబంధించిన మనీ లాండరింగ్ కేసులో రాజస్థాన్ కాంగ్రెస్ అధ్యక్షుడు గోవింద్ సింగ్ దోస్తారా, మహువా అసెంబ్లీ నియోజకవర్గ కాంగ్రెస్ అభ్యర్థి ఓంప్రకాశ్ హుడ్లా ఇండ్లపై ఈడీ దాడులు చేసింది. ఈడీ దాడులపై సీఎం గెహ్లాట్ ఆగ్రహం వ్యక్తం చేశారు. బీజేపీ దేశంలో బీభత్సం సృష్టిస్తున్నదని మండిపడ్డారు. ఏ రాష్ట్రంలో ఎన్నికలు జరుగుతుంటే.. ఆ రాష్ట్రంలో ఈడీ దాడులు జరుగుతాయని ఆరోపించారు. రాజస్థాన్‌లో ఓటమి ఖాయమని తెలిసిన బీజేపీ చివరి ప్రయత్నంగా ఈడీ దాడులకు తెగబడిందని కాంగ్రెస్ జాతీయాధ్యక్షుడు మల్లికార్జున్ ఖర్గే ఆరోపించారు.

బెంగాల్ మంత్రి నివాసంలోనూ..

కోల్‌కతా: బెంగాల్ అటవీ శాఖ మంత్రి, తృణమూల్ నాయకుడు జ్యోతిప్రియో మల్లిక్ నివాసం, కార్యాలయాల్లో గురువారం ఈడీ సోదాలు నిర్వహించింది. రేషన్ సరఫరాలో అక్రమాలు చోటుచేసుకున్నాయన్న ఆరోపణల కేసులో ఈ తనిఖీలు చేపట్టినట్టు అధికారులు తెలిపారు. దీనిపై తృణమూల్ మండిపడింది. ఇదంతా రాజకీయ కక్షసాధింపేనని ఆరోపించింది.

బీజేపీ మోసం చేసింది

- స్వతంత్ర అభ్యర్థిగా బరిలోకి దిగిన ఆ పార్టీ నేత లోకేంద్ర మెహతా

(స్పెషల్ టాస్క్ బ్యూరో)

హైదరాబాద్, అక్టోబర్ 26(నమస్తే తెలంగాణ): మధ్యప్రదేశ్ బీజేపీలో నాగదా ఖాచరోద్ అసెంబ్లీ స్థానానికి టికెట్ లభించకపోవడంతో స్థానిక నేత లోకేంద్ర మెహతా తిరుగుబావుటా ఎగురవేశారు. బీజేపీ తనను మోసం చేసిందని ఆరోపించారు. స్వతంత్ర అభ్యర్థిగా ఆయన నామినేషన్ వేశారు. 25 ఏండ్లుగా పార్టీ కోసం పని చేస్తున్నానని, పార్టీ అభివృద్ధికి రాత్రిపగలు కష్టపడి పనిచేశానని, ముక్కుమొహం తెలియని వారికి టికెట్లిచ్చారని ఆరోపించారు.

మరాఠా రిజర్వేషన్ల కోసం ఇద్దరు యువకుల ఆత్మహత్య

ఛత్రపతి శంభాజీనగర్, అక్టోబర్ 26: మరాఠాలకు రిజర్వేషన్లు కల్పించాలని డిమాండ్ చేస్తూ మహారాష్ట్రలో గురువారం ఇద్దరు ఆత్మహత్యకు పాల్పడ్డారు. గణేశ్ కాకాసాహెబ్ కుబేర్ (28) ఆప్తగావ్‌లోని తన స్వగృహంలో ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. హింగోలిలోని అఖడ బాలాపూర్‌లో కృష్ణ కళ్యాంకర్ (25) అనే యువకుడు తన పొలంలోని చెట్టుకు ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు.

ఇజ్రాయెల్ దాడుల్లో ధ్వంసమైన గాజాలోని భవనాల నుంచి వెలువడుతున్న మంటలు

గాజాలోకి ఇజ్రాయెల్ యుద్ధ ట్యాంకులు

- లక్ష్యాలపై మెరుపుదాడి చేసి తిరిగి వెనక్కి
- భూతల దాడులు మొదలుపెట్టిన సైన్యం

రఫా, వాషింగ్టన్, అక్టోబర్ 26: ఇజ్రాయెల్ యుద్ధ ట్యాంకులు గురువారం ఉత్తర గాజాలోకి అడుగుపెట్టాయి. హమాస్ స్థావరాలే లక్ష్యంగా భూతల దాడులు చేపట్టాయి. సుమారు 250 స్థావరాలే దాడులు చేసినట్టు ఇజ్రాయెల్ సైన్యం ప్రకటించింది. ఈ దాడుల్లో కొందరు మిలిటెంట్లను హతమార్చి వారి మౌలిక సదుపాయాలను, యాంటీ-ట్యాంక్ మిస్సైల్ లాంచింగ్ పొజిషన్లను ధ్వంసం చేసినట్టు తెలిపింది. తిరిగి యుద్ధ ట్యాంకులు వెనక్కి వచ్చేసినట్టు పేర్కొన్నది. మరోవైపు గాజా-లెబనాన్ సరిహద్దులో గురువారం వైమానిక, డ్రోన్ దాడులు చేసినట్టు పేర్కొన్నది. యుద్ధం కారణంగా మృతుల సంఖ్య భారీగా పెరుగుతున్నది. మందుల కొరత వల్ల క్షతగాత్రుల ఇన్‌ఫెక్షన్ల రేటు పెరుగుతున్నదని గాజాలోని ఒక వైద్యుడు తెలిపారు.

దాడులకు ఆర్థిక కారిడార్ ఒక కారణం!

ఇజ్రాయెల్‌పై హమాస్ చేసిన దాడికి ఇండియా-మధ్య ప్రాచ్యం-యూరప్ ఆర్థిక కారిడార్ ఒక కారణమని అమెరికా అధ్యక్షుడు జో బైడెన్ అభిప్రాయపడ్డారు. ఆస్ట్రేలియా ప్రధాని అల్బనీస్‌తో కలిసి బుధవారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన ఈ వ్యాఖ్యలు చేశారు. అయితే తన అభిప్రాయానికి ఆధారాలు లేవని.. ఇజ్రాయెల్ అనుసంధానత, ప్రాంతీయ అనుసంధానం కోసం తాము చేస్తున్న ప్రయత్నాల వల్ల ఈ దాడులు జరిగి ఉండొచ్చన్నారు.

మణిపూర్‌లో ఇంటర్నెట్‌పై నిషేధం పొడిగింపు

ఇంఫాల్, అక్టోబర్ 26: రాష్ట్రంలో మరి కొద్ది రోజుల్లో మొబైల్ ఇంటర్నెట్ సేవల్ని పునరుద్ధరిస్తామన్న మణిపూర్ సీఎం ఎన్ బీరేన్‌సింగ్ చెప్పిన మాటలు అమల్లోకి రాలేదు. మొబైల్ ఇంటర్నెట్‌ను అక్టోబర్ 31వరకు పొడగిస్తూ బీరేన్‌సింగ్ ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. విద్వేష ప్రసంగాలు, రెచ్చగొట్టే ఫొటోలు, వీడియోలతో సంఘ విద్రోహ శక్తులు శాంతిభద్రతలను దెబ్బతీసే అవకాశముందన్న భయంతో బ్యాన్‌ను పొడగిస్తున్నాం' అని రాష్ట్ర హోం శాఖ కమిషనర్ తాజాగా నోటిఫికేషన్ జారీచేశారు.

జమిలికి 30 లక్షల ఈవీఎంలు అవసరం!

న్యూఢిల్లీ: జమిలి ఎన్నికలు నిర్వహించడానికి ఎన్నికల సంఘానికి సుమారు 30 లక్షల ఈవీఎంలు అవసరమవుతాయని, సన్నద్ధతకు ఏడాదిన్నర సమయం అవసరమని ప్రభుత్వ వర్గాలు వెల్లడించాయి. జమిలి నిర్వహణ సాధ్యాసాధ్యాలపై మాజీ రాష్ట్రపతి కోవింద్ నేతృత్వంలో కేంద్రం ఓ కమిటీని ఏర్పాటు చేసిన విషయం తెలిసిందే. జమిలి ఎన్నికల రోడ్‌మ్యాప్‌ను లా కమిషన్ బుధవారం కమిటీకి అందజేసింది.

కర్ణాటకలో ఘోర రోడ్డు ప్రమాదం

- 13 మంది ఆంధ్రప్రదేశ్ వలస కూలీల మృతి

హైదరాబాద్, అక్టోబర్ 26 (నమస్తే తెలంగాణ): కర్ణాటకలోని చిక్‌బళ్లాపూర్ సమీపంలో ఘోర రోడ్డు ప్రమాదం జరిగింది. రోడ్డుపై ఆగి ఉన్న ట్యాంకర్‌ను టాటా సుమో వాహనం వేగంగా వచ్చి ఢీ కొట్టింది. ఈ ప్రమాదంలో 13 మంది వలస కూలీలు దుర్మరణం చెందగా.. తీవ్రంగా గాయపడిన మరొకరి పరిస్థితి విషమంగా ఉంది. వీరంతా ఆంధ్రప్రదేశ్‌లోని శ్రీసత్యసాయి జిల్లా గోరంట్ల మండలానికి చెందిన వారిగా పోలీసులు గుర్తించారు. మృతుల్లో 9 మంది పురుషులు, ముగ్గురు మహిళలు, ఓ బాలుడు ఉన్నట్టు చిక్‌బళ్లాపూర్ పోలీసు అధికారి నాగేశ్ తెలిపారు. దసరా పండుగకు కూలీలంతా సొంతూళ్లకు వెళ్లారు. తిరిగి ఉపాధి కోసం బెంగళూరులోని హోంగసంద్ర వెళ్తుండగా ఈ ప్రమాదం జరిగింది. తెల్లవారుజామున పొగమంచు ఉండటంతో డ్రైవర్ నరసింహులు.. ఆగి ఉన్న ట్యాంకర్ గమనించకుండా ఢీ కొట్టాడు. దీంతో ఆ వాహనంలో ప్రయాణిస్తున్న 14 మందిలో ఐదుగురు అక్కడికక్కడే మృతిచెందగా, 8 మంది చిక్‌బళ్లాపూర్ ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మరణించారు.